క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గండేపల్లి: వ్యాన్ ఢీకొన్న ఘటనలో మోటారు సైకిల్‌పై వస్తున్న యువకుడు మృతి చెందాడు. రామేశంపేట సమీపంలో ఏడీబీ రోడ్డుపై మంగళవారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. ఎస్సై ఎస్.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గంపేటకు చెందిన ఆలపాటి రాజేష్ (22) తాపీపని చేసుకుంటున్నాడు. పెద్దాపురానికి పని నిమిత్తం మోటార్ సైకిల్‌పై వెళ్లాడు. తిరిగి జగ్గంపేట వస్తుండగా రామేశంపేట సమీపంలో ఏడీబీ రోడ్డుపై అతడిని ఎదురుగా వస్తున్న వ్యాన్ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజేష్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ వ్యాన్‌ను నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

రావులపాలెం: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్ ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైన విద్యార్థి గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కొమరాజులంకలోని గౌతమీ గోదావరి పుష్కరఘాట్ వద్ద బుధవారం రావులపాలెంలోని ఇందిరానగర్‌కు చెందిన పలివెల శ్రీనివాస్ మౌళీ శంకర్ (18) లభించింది. సీనియర్ ఇంటర్‌లో మ్యాథ్స్ ఫెయిల్ కావడంతో శంకర్ ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అతడి కోసం తండ్రి గోపి వెతుకుతున్నారు. ఈ నేపథ్యంలో శంకర్ మృతదేహం లభించడంతో విషాదఛాయలు నెలకొన్నాయి. తండ్రి గోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొత్తపేట ఏరియా ఆస్పత్రికి తరలించామని హెచ్‌సీ వైకుంఠరావు తెలిపారు.

సీతారాముల కల్యాణం.. చూతము రారండీ..

- వాడ వాడలా శ్రీరామ నవమి వేడుకలు
- పలుచోట్ల అన్నదానాలు

కొవ్వూరు: శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం పట్టణంలోని, మండలంలోని రామాలయాల్లో సీతా రాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వ హించారు. స్థానిక శ్రీనివాసపురం రామాలయం వద్ద నిర్వహించిన కల్యాణ వేడుకలో వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొన్నారు. మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, వైస్ చైర్ పర్సన్‌లు మన్నె పద్మ, గండ్రోతు అంజనీదేవి, శ్రీరామా సొసైటీ అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, యూత్ అధ్యక్షుడు సిద్ధన వాసు, నాయకులు వరిగేటి సుధాకర్, కౌన్సిలర్లు తోట లక్ష్మీప్రసన్న, చీరా అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక పాతపేట రామాలయం, రౌండ్ రామాలయం, ఫ్యాక్టరీ క్లబ్ ప్రాంగణంలోను, మొక్కల చింతల రామాలయం, కోర్టు ప్రాంగణంలోని న్యాయ గణపతి ఆలయం వద్ద, 11వ వార్డు రామాలయం, దగ్గు వారి రామాలయం, గౌతమీనగర్‌లో పురుషోత్తరామ మందిరంలోను కల్యాణం నిర్వహించారు. అలాగే రెండో వార్డులోని రామాలయం, అచ్చాయమ్మ కాలనీలోను, నాళం వారి వీధి రామాలయం, ఏటిగట్టు కోదండ రామాలయం వద్ద బాజా భజంత్రీలతో శాస్త్రయుక్తంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు పానకం పంపిణీ చేశారు. కోర్టు ప్రాంగణం వద్ద నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు. స్థానిక మెరకవీధిలోని రౌండ్ రామాలయం వద్ద సుమారు ఐదు వేల మందికి, ఫ్యాక్టరీ క్లబ్‌లోను భక్తులకు అన్నదానం చేశారు.

దేవరపల్లి: మండలంలోని గ్రామగ్రామానా రాములోరి కల్యాణ మహోత్సవాలు నిర్వహించి భక్తులకు చలివిడి, పానకాలు అందజేశారు. స్థానిక పల్లపు వీధి, మెరకవీధి రామాలయాలు, బందపురంలోని కోదండ రామాలయం, లక్ష్మీపురం, దుద్దుకూరు, గౌరీపట్నం, త్యాజంపూడి, చిన్నాయగూడెం, యాదవోలు, యర్నగూడెం తదితర గ్రామాల్లో శ్రీరాముని కల్యాణాన్ని శాస్త్రబద్ధంగా నిర్వహించారు. దేవరపల్లిలో నిర్వహించిన కల్యాణానికి స్థానిక షిర్డీసాయి మందిరం తరఫున కమిటీ సభ్యులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు.


కొవ్వూరు శ్రీనివాసపురంలో సీతారాములను దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు


పెరవలి మండలం ఖండవల్లిలో సీతారాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు

తాళ్లపూడి: స్థానిక పద్మశాలీల, వడ్డీల రామాలయాలు, మదన గోపాలస్వామి గుడి, శివాలయం, అనంతం వారి వీధిలోని సాయిబాబా గుడి, మైగాపుల వారి వీధిలోని రామాలయం వద్ద శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేగేశ్వరపురంలోని శ్రీరామ్‌నగర్‌లోని పట్టాభిషేక రామాలయం వద్ద టీటీడీ ధర్మప్రచార పరిషత్ సభ్యుడు పరస రాధాకృష్ణ ఆధ్వర్యంలో వైభంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. భారీ ఎత్తున అన్నసమారాధన చేశారు. అదే గ్రామంలోని పెద రామాలయం వద్ద, మేదర్ల పేట, వడ్డీల రామాలయాల వద్ద, గోదావరి గట్టు కింద గల ఆంజనేయస్వామి ఆలయం వద్ద నవమి వేడుకలు నిర్వహించారు. పెద్దేవంలోని పురాతన ఆలయంలో, పోచవరం, తాడిపూడి, మలకపల్లి, తిరుగుడుమెట్ట, అన్నదేవరపేట, తుపాకులగూడెం, రాగోలపల్లి, రావూరుపాడు గ్రామాల్లోనూ స్వామివారి కల్యాణ వేడుకను ఘనంగా నిర్వహించారు.

చాగల్లు: స్థానిక మెయిన్ రోడ్డులోని రామాలయంలోను, నెలటూరు సీతారామస్వామి ఆలయంలోను స్వామివారి కల్యాణాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బ్రాహ్మణగూడెం రామాలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఉంచి కల్యాణ క్రతువు జరిపారు. ఆలయ అర్చకుడు పి. ప్రసాద్ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. కలవలపల్లి గ్రామంలో సీతారామ లక్ష్మణుల విగ్రహాలతో ఊరేగింపు జరిపారు. చిక్కాల, దారవరం, చంద్రవరం గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు.

ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రు, పసలపూడి, వేలివెన్ను, వెలగదుర్రు, చిలకపాడు, తదితర గ్రామాల రామాలయాల్లో పండితుల వేద మంత్రాల నడుమ రాములోరి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. వడపప్పు, పానకం, పులిహోర, తదితర ప్రసాదాలు పంచారు. ఉండ్రాజవరంలో రాములవారిని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు దర్శించుకుని, పూజలు చేశారు. చివటం, తాడిపర్రు, వెలగదుర్రు, చిలకపాడు, ఉండ్రాజవరం గ్రామాల్లో అన్న సమారాధన చేశారు.

పెరవలి: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకరపర్రు, తీపర్రు గ్రామాల్లో భారీఎత్తున అన్న సమారాధనలు జరిగాయి. ఖండవల్లి, తీపర్రు గ్రామాల్లో నిర్వహించిన స్వామి వారి కల్యాణ వేడుకల్లో నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు పాల్గొన్నారు. ఎంపీపీ కార్నెల్ల ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు బొకే వెంకటేశ్వర్లు, రవి ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నల్లజర్ల: స్థానిక శ్రీరామకృష్ణ భక్త మందిరంలో వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం దంపతుల చేతుల మీదుగా సీతారామ కల్యాణాన్ని నిర్వహించారు. కవులూరులోని కోదండ రామాలయం 35వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీరామ నవమి వేడుకలు జరిగాయి. మంచిరాజు నరసింహం, కరుటూరి ముత్యం దంపతులు పూజాదికాలు నిర్వహించారు. అనంతపల్లిలోని శ్రీవిశ్వేశ్వర సీతారామ మందిరం వద్ద, పోతవరం సీతారామస్వామి ఆలయం వద్ద శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాలు జరిగాయి. పోతవరంలో హోం మంత్రి తానేటి వనిత కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఘంటావారిగూడెం, ప్రకాశరావుపాలెం, తూర్పు చోడవరం, తెలికిచెర్ల గ్రామాల్లో వైభవంగా కల్యాణోత్సవాలు జరిగాయి.

గోపాలపురం: స్థానిక సీతారాముల మందిరంలో ఆలయ కమిటీ చైర్మన్ పడమట సత్యనారాయణ దంపతులు స్వామివారి కల్యాణం నిర్వహించారు. బీసీ కాలనీ, చిట్యాల, వేళ్లచింతలగూడెం, దొండపూడి మండలంలోని వివిధ గ్రామాల్లో సీతారాములు కల్యాణాలు జరిగాయి. భక్తులకు పానకం, వడపప్పు ప్రసాదంగా పంపిణీ చేశారు.

నిడదవోలు రూరల్: ఉనకరమిల్లి గ్రామంలో సీతారామల ఆలయ 82 వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీరామచంద్రమూర్తికి, సీతాదేవికి కల్యాణం జరిపించారు. మునిపల్లిలో రామాలయం వద్ద ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన జరిగింది. తాళ్లపాలెంలో పురాతనమైన సీతారామస్వామి దేవస్థానం వద్ద చలువ పందిర్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పసుపు, కుంకుమ పూజలు నిర్వహించారు. సమిశ్రగూడెంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పానక పంపిణీ చేశారు. భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు.


దేవరపల్లిలోని పల్లపు వీధి కోదండ రామాలయం వద్ద నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణం


వేగేశ్వరపురంలోని శ్రీరామ్‌నగర్ రామాలయం వద్ద సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


చాగల్లు మండలం బ్రాహ్మణగూడెంలో సీతారామ లక్ష్మణ ఆంజనేయ విగ్రహాలు


ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో సీతారాముల కల్యాణం

ఎమ్మెల్యేకు మద్దతుగా కుమారుడి ప్రచారం

నిడదవోలు: వలంటీర్ వ్యవస్థ ద్వారా గడప గడపకూ ప్రస్తుతం అందుతున్న సంక్షేమ ఫలాలు కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తన తండ్రి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడిని, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడి కుమారుడు వరుణ్ సాయి ప్రజలను కోరారు. బుధవారం ఆయన పార్టీ శ్రేణులతో కలసి పట్టణంలోని 16వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. పట్టణంలో చేపట్టిన అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ ప్రచారంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, కౌన్సిలర్లు పడాల శిరీష, గోపిరెడ్డి శ్రీనివాస్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


నిడదవోలు 16వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడి కుమారుడు వరుణ్ సాయి

ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టు పరిశీలన

నల్లజర్ల: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అనంతపల్లి శివారు వీరవల్లి టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టును స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో(సెబ్) జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి బుధవారం రాత్రి ఆకస్మికంగా పరిశీలించారు. చెక్ పోస్టు ప్రారంభించిన నాటి నుంచీ నేటి వరకూ పనితీరును సమీక్షించారు. ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం అక్రమ రవాణా జరగకుండా పగడ్బందీగా అడ్డుకట్ట వేయాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట దేవరపల్లి ఎస్ఈబీ సీఐ కేవీ స్వామి, ఎస్ఐ పి.సుధీర్, సిబ్బంది ఉన్నారు.


వాహన తనిఖీలను పరిశీలిస్తున్న ఎస్ఈబీ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి

గొల్లగూడెంలో గడ్డివాము దగ్ధం

దేవరపల్లి: విద్యుదాఘాతం వల్ల మండలంలోని గొల్లగూడెంలో బుధవారం ఉదయం గడ్డివాము దగ్ధమైంది. గడ్డివాము మీదుగా వెళుతున్న విద్యుత్తు తీగలపై కాకి వాలడంతో మంటలు వ్యాపించినట్టు రైతు గడా శ్రీహరి తెలిపారు. మంటల కారణంగా కిందనే ఉన్న 375 కట్టల గడ్డివాము పూర్తిగా దగ్ధమైయిందన్నారు. దీని విలుల సుమారు రూ.60 వేలు ఉంటుందని ఆయన తెలిపారు. కొవ్వూరు అగ్నిమాపక అధికారులు మంటలను అదుపు చేశారు.


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుమామిడి గ్రామ శివార్లలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ బుధవారం తెలిపారు. కోరుమామిడికి చెందిన సుంకర రత్నకుమారిని అరెస్ట్ చేసి 16 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

మూడుచోట్ల ఫారం- 12 సేకరణ కేంద్రాలు

నిడదవోలు: ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వోద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు నియోజకవర్గంలోని మూడు చోట్ల ఫారం- 12 సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని నిడదవోలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.వెంకట రమణ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిడదవోలు పట్టణం, నిడదవోలు మండలం పరిధిలోని ఇతర పోలింగ్ అధికారులు (ఓపీవో), సూక్ష్మ పరిశీలకులు(మైక్రో అబ్జర్వర్స్) నిడదవోలు మున్సిపల్ ఆఫీసులో ఏర్పాటు చేసిన ఫారం- 12 సేకరణ కేంద్రంలో పోస్టల్ ఓట్ల కోస దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే పెరవలి, ఉండ్రాజవరం మండలాలకు చెందిన అధికారులైతే ఆయా తహసీల్దార్ల ఆఫీసుల్లో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. వారంతా ఫారం- 12ను పూర్తి చేసి, ఎన్నికల ఉత్తర్వుల కాపీని, ఆధార్ కార్డ్, ఓటరు గుర్తింపు కార్డు జిరాక్సులు, రెండు కొత్త పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు జత చేసి ఏప్రిల్ 22 లోగా అందజేయాలని రమణ నాయక్ తెలిపారు.

బిల్డింగ్ పైనుంచి పడి తాపీమేస్త్రి మృతి

గోపాలపురం: బిల్డింగ్‌పై నుంచి పడి తాపీమేస్త్రి మృతి చెందిన ఘటన భీమోలు గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్సై కర్రి సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపురానికి చెందిన షేక్ యాసీన్ (36) తాపీమేస్త్రి. బుధవారం భీమోలు గ్రామంలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తూ బిల్డింగ్‌పై నుంచి జారి పడ్డాడు. తలకు తీవ్ర గాయమైన అతడిని గోపాలపురం సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కట్నం వేధింపులతో వివాహిత మృతి

కొత్తపల్లి: కట్నం కోసం అత్తింటి వేధింపులు తట్టుకోలేక ఒక వివాహిత ఉరి వేసుకుని మృతి చెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పాడకు చెందిన కోటి అనిల్‌కు రాజోలుకు చెందిన కొండా అనూష (29)తో 2019 జూన్‌లో వివాహమైంది. వీరికి 4 ఏళ్ల మానస్ అనే కుమారుడు ఉన్నాడు. వివాహ సమయంలో రూ.3 లక్షల కట్నం, 3 కాసుల బంగారం, పలు లాంచనాలు ఇచ్చారు. అయినా అత్తమామలు, భర్త, ఇద్దరు ఆడపడుచులు అదనపు కట్నం కోసం అనూషను వేధిస్తున్నారు. పుట్టింటి వారితో మాట్లాడాలంటే భర్తే దగ్గర ఉండి ఫోన్ చేయించేవాడు. మనవడు మానస్‌తో కూడా మాట్లాడలేని పరిస్థితిని తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో వారి వేధింపులు తాళలేక అనూష బుధవారం ఉరి వేసుకుని మృతి చెందింది. ఆమె తల్లి కొండా నీల సత్యవతి ఫిర్యాదు మేరకు భర్త అనిల్, అత్తమామలు, ఆడపడుచులపై ఎస్సై స్వామి నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


తల్లి కోసం తల్లడిల్లుతున్న మానస్


అనూష (ఫైల్)

వివాహిత ఆత్మహత్య

కాకినాడ క్రైం: భర్త, అత్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. కాకినాడ జగన్నాథపురం ఏఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న నగరబోయిన వెంకటేశ్వర్లు, వెంకట రమణ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె శిరీష (25)కు అమలాపురం మండలం కామనగరువుకు చెందిన దంగేటి శ్రీనివాస్‌తో గతేడాది సెప్టెంబర్‌లో వివాహం చేశారు. శ్రీనివాస్ కాకినాడలోని రైస్‌మిల్లులో పనిచేస్తున్నాడు. వివాహం తర్వాత ఈ దంపతులు జగన్నాథపురం కోమలవారి వీధిలో నివాసం ఉంటున్నారు. అనుమానం, అదనపు కట్నం వేధింపులతో అత్త గంగారత్నం, భర్త శ్రీనివాస్ చేతిలో శిరీష నిత్యం నరకం అనుభవించేది. వారిద్దరూ పలుమార్లు ఆమెను శారీరకంగా వేధించారు. మనస్తాపం చెందిన శిరీష మంగళవారం రాత్రి ఇంట్లోనే పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమె కాకినాడ జీజీహెచ్‌లో చేర్పగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భర్త శ్రీనివాస్, తల్లి గంగారత్నంపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు

- యాగశాలలో ప్రత్యేక హోమాలు
- సత్యదేవుని ఆలయంలో పూర్తయిన ఏర్పాట్లు

అన్నవరం: సత్యదేవుని ఆలయంలో నూతన స్వర్ణ ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించేందుకు యాగశాల నిర్మించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఐదు హోమగుండాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ధ్వజస్తంభం కర్రను స్వామివారి ఆలయంలోని అనివేటి మండపం వద్దకు చేర్చారు. దానిని నిలబెట్టేందుకు కాంక్రీట్‌తో పునాదిని సిద్ధం చేశారు. మంటపం శ్లాబ్ నుంచి ధ్వజస్తంభం వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేశారు.

22న ప్రతిష్ఠాపన

నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠకు సంబంధించి గురువారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకూ ప్రత్యేక పూజలు చేస్తారు. గురువారం ఉదయం 11 గంటలకు వినాయక పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, మండపారాధన, జలాదివాసం నిర్వహిస్తారు. శుక్రవారం క్షీరాదివాసం, శనివారం పుష్పాదివాసం, ఆదివారం ధాన్యాదివాసం, 22వ తేదీ కలాన్యాశం, శయ్యాదివాసం తదితర పూజలు నిర్వహిస్తారు. అనంతరం 22వ తేదీ ఉదయం 10.48 గంటలకు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఆ తర్వాత స్తంభానికి రాగి రేకు అమర్చి స్వర్ణ రేకు తాపడం చేయనున్నారు. ఇందుకయ్యే ఖర్చంతా నెల్లూరుకు చెందిన భక్తుడి కుటుంబ సభ్యులు భరిస్తున్న సంగతి తెలిసిందే.


ధ్వజస్తంభం మొదలు భాగంలో చేసిన రాగి రేకు తాపడం

చదరంగం పోటీల్లో బాలల ప్రతిభ

అమలాపురం టౌన్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురం విద్యానిధి స్కూల్‌లో బుధవారం జిల్లా స్థాయి అండర్ -17 చెస్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా బాలబాలికలు చదరంగంలో తమ ప్రతిభను చాటారు. నలుగురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పోటీలను జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి తాడి వెంకట సురేష్ పర్యవేక్షించారు. బాలుర విభాగంలో ద్రాక్షారపు సాత్విక్, బండారు నాని ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. బాలికల విభాగంలో పినిశెట్టి ధరణి, నూకపెయ్యి హన్విక మొదటి, రెండు స్థానాల్లో నిలిచారు. విజయవాడలోని పోరంకి గ్రీన్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఈనెల 20వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో వీరు నలుగురూ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు. కాగా.. జిల్లా స్థాయి పోటీలకు 40 మంది బాలబాలికలు హాజరయ్యారు. విజేతలకు విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు బహుమతులు అందజేశారు.


రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

వృద్ధురాలి దారుణ హత్య

- నిద్రిస్తుండగా పీక కోసి చంపిన మనవరాలి భర్త
- కుటుంబ కలహాలతో ఘాతుకం

కొత్తపేట: పెళ్లి చేసుకుని ఆనందంగా కాపురానికి వెళ్లిన ఆమె తన భర్త అనుమానపు జబ్బును చూసి బెంబేలెత్తిపోయింది. ఏదోలా రాజీపడి బతుకుతున్నా భర్త వేధింపులు ఎక్కువ కావడంతో భరించలేకపోయింది. తల్లి లేని ఆమె తన అమ్మమ్మ ఇంటికి ఇద్దరు కుమారులతో కలిసి వచ్చేసింది. అయితే కోపం పెంచుకున్న భర్త ఆ అమ్మమ్మను దారుణంగా హత్య చేశాడు. మండలంలోని గంటి గ్రామంలో శిరిగినీడి గంటాలమ్మ (78) హత్య కలకలం రేపింది. ఎస్సై ఎం.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గంటాలమ్మ మనవరాలు (కూతురి కుమార్తె) నాగదేవికి సుమారు 9 ఏళ్ల క్రితం తెలంగాణలోని ఖమ్మం జిల్లా వైరా మండలం రెబ్బవరం గ్రామానికి చెందిన సాదం రామకృష్ణతో వివాహం జరిగింది. కొంత కాలం వీరి సంసారం సజావుగా సాగింది. అనంతరం భార్యపై అనుమానంతో రామకృష్ణ తరచూ గొడవలు పడేవాడు. ఆ క్రమంలో తన తమ్ముడి నరేష్‌తో అక్రమ సంబంధం ఉందనే అనుమానంతో అతడిని గొడ్డలితో నరికి హత్య చేశాడు. ఈ కేసులో అరెస్టైన రామకృష్ణ కొన్నేళ్ల క్రితం జైలు నుంచి బయటకు వచ్చాడు. ఆ తర్వాత పెద్దల సమక్షంలో భార్యాభర్తలు రాజీపడ్డారు. భార్య కోరిక మేరకు ఆలమూరు మండలం చెముడులంకలో కాపురం ప్రారంభించారు. కానీ రామకృష్ణ అనుమానంతో మళ్లీ నాగదేవిని చిత్రహింసలకు గురిచేశాడు. అవి భరించలేని నాగదేవి తన ఇద్దరు కుమారులతో గంటిలో అమ్మమ్మ గంటాలమ్మ ఇంటికి వచ్చేసింది. గత ఏడాది అక్టోబర్‌లో తన భార్యను కాపురానికి పంపించాలని గంటాలమ్మతో రామకృష్ణ ఘర్షణ పడ్డాడు. ఆమెపై దాడి చేసి, ఇంటిలో వస్తువులు చెల్లాచెదురు చేసి, చంపేస్తానంటూ బెదిరించాడు. దీంతో నాగదేవి కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, రామకృష్ణను అరెస్టు చేశారు. స్థానిక సబ్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన రామకృష్ణ బుధవారం తెల్లవారుజామున గంటాలమ్మ ఇంట్లోకి ప్రవేశించాడు. హాల్లో నిద్రిస్తున్న గంటాలమ్మ పీకను కత్తితో కోసేశాడు. ముఖం, భుజంపై విచక్షణారహితంగా నరకడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అమ్మమ్మ కేకలకు పక్క గదిలో పిల్లలతో కలిసి నిద్రిస్తున్న నాగదేవి భయంతో తలుపులు వేసుకుని దాక్కుంది. రామకృష్ణ వెళుతూ ఏదోరోజు నిన్ను కూడా చంపేస్తానని భార్యను బెదిరించాడు. సమాచారం అందుకున్న రావులపాలెం సీఐ రామ్‌కుమార్, ఎస్సై ఎం.అశోక్ సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నాగదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అశోక్ తెలిపారు.


గంటాలమ్మ మృతదేహం











అంబేడ్కర్ బాటలో జగన్ పాలన

- వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత
- ద్వారకాతిరుమల మండలంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం

దేవరపల్లి: ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత కోరారు. ద్వారకాతిరుమల మండలం పి.కన్నాపురం, శంఖరాపురం, సత్తాల, గుణ్ణంపల్లి గ్రామాల్లో బుధవారం రాత్రి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ మీ కుటుంబాలకు మంచి జరగాలంటే మరలా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. జగనన్న పాలనలో మన కుటుంబాల్లో మంచి మార్పు వచ్చిందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం జగనన్న రాష్ట్రంలో సుపరిపాలన అందించారని ఆమె అన్నారు. ప్రచారానికి వచ్చిన వనితకు గ్రామాల్లో అడుగడుగునా మహిళలు హారతులు పట్టారు. ప్రచారంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని వెంకన్నబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసుబాబు, జెడ్పీటీసీ సభ్యులు చిగురుపల్లి శామ్యూల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


పి.కన్నాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న తానేటి వనిత

నేడు తలారి వెంకట్రావు నామినేషన్

తరలి రావాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు రాజీవ్ కృష్ణ పిలుపు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు గురువారం ఉదయం 11.04 గంటలకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారు. ఈ వేడుకలో పార్టీ నాయకులందరూ సమష్టిగా పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఎస్.రాజీవ్‌కృష్ణ బుధవారం విజ్ఞప్తి చేశారు. ఇటీవల పార్టీ నాయకుల మధ్య చోటు చేసుకున్న స్వల్ప వివాదాలను అధిష్టానం పరిష్కరించిందన్నారు. కొవ్వూరు మెరక వీధిలోని క్యాంపు కార్యాలయం వద్ద నుంచి తలారి వెంకట్రావు ఉదయాన్నే ర్యాలీగా బయల్దేరి సబ్ కలెక్టర్ కార్యాలయానికి నామినేషన్ దాఖలుకు వెళతారని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు నామినేషన్ ప్రక్రియకు హాజరు కావాలని కోరారు. పార్టీ శ్రేణులంతా ఉదయం 8 గంటలకు క్యాంపు కార్యాలయానికి తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.


తలారి వెంకట్రావు

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు నామినేషన్ కార్యక్రమానికి తాళ్లపూడి మండలంలోని పార్టీ శ్రేణులందరూ గురువారం ఉదయమే కొవ్వూరు పట్టణానికి త రలి రావాలని ఆ పార్టీ తాళ్లపూడి మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు బుధవారం కోరారు.

రేపు మంత్రి తానేటి వనిత నామినేషన్

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత శుక్రవారం ఉదయం 10.45 గంటలకు నామినేషన్ దాఖలు చేస్తారు. గోపాలపురం తహసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి శివజ్యోతికి మంత్రి వనిత నామినేషన్ పత్రాలు సమర్పిస్తారు. అంతకు ముందు ఉదయం 8 గంటలకు యర్నగూడెంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులతో కలసి భారీ ర్యాలీగా బయలుదేరి దేవరపల్లి మీదుగా గోపాలపురంలోని వైఎస్సార్ జంక్షన్‌కు చేరుకుంటారు. అక్కడ పార్టీ శ్రేణులను ఉద్దేశించి మంత్రి మాట్లాడతారు. అక్కడి నుంచి రిటరి్నంగ్ అధికారి కార్యాలయాని వెళ్లి నామినేషన్ పత్రాలు అందజేస్తారు. ఈ మేరకు మంత్రి వనిత ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నియోజకవర్గంలోని గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, నామినేషన్ కార్యక్రమానికు తరలిరావాలని మంత్రి వనిత కోరారు. సుమారు 25 వేల మందితో యర్నగూడెం నుంచి గోపాలపురానికి భారీ ర్యాలీకి పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.


తానేటి వనిత, రాష్ట్ర హోం మంత్రి

నేడు నాలుగు గ్రామాల్లో మంత్రి వనిత ప్రచారం

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత గురువారం సాయంత్రం 4 గంటల నుంచి మండలంలోని రామన్నపాలెం, కొత్తగూడెం, ధుమంతునిగూడెం, కృష్ణంపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేస్తారని ఆ పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ గురువారం తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచారంలో పాల్గొనాలని ఆయన కోరారు.

మునేశ్వరరావు మృతి పార్టీకి తీరనిలోటు


మునేశ్వరరావు పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తిరుమళ్ల మునేశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని అట్లపాడు గ్రామానికి చెందిన మునేశ్వరరావు బుధవారం మృతి చెందారు. దీంతో శ్రీనివాస్‌నాయుడు ఆ గ్రామం వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మునేశ్వరరావు కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, స్థానిక నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

మూడు కుటుంబాలకు 'మానవత' సాయం

నల్లజర్ల: మూడు కుటుంబాలకు మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ బుధవారం రూ.17 వేల ఆర్థిక సాయం చేసింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఘంటావారిగూడేనికి చెందిన రాచూరి గాయత్రికి ఆ సంస్థ తరఫున రూ.4 వేలు, కన్వీనర్లు పాకలపాటి ప్రసాద్ రూ.1000, నాదెళ్ళ శ్రీరామ్మూర్తి రూ.1000 ఆర్థిక సాయం చేశారు. అదే గ్రామానికి చెందిన సుంకవల్లి సీతారత్నంకు మానవత సంస్థ రూ.4 వేలు, పాకలపాటి ప్రసాద్ రూ.1000, నాదెళ్ళ శ్రీరామ్మూర్తి రూ.2 వేల ఆర్థిక సాయం అందించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న నబీపేటకు చెందిన తుమ్మల సుధారాణికి మానవత సంస్థ రూ.4వేల సాయం అందించారు. కార్యక్రమాల్లో ఆ సంస్థ మండలశాఖ చైర్మన్ భోగవల్లి వెంకట సుబ్బారావు, అధ్యక్షుడు ఐడీవీ అప్పారావు, జిల్లా కోశాధికారి గుళ్ళపూడి వెంకటరత్నం, డైరెక్టర్ దావులూరి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.







